# శిలాప్రతిమ

చింతా దీక్షితులు



౧

"త్యాగం అంటే ఏమిటండీ" అన్నాను భైరవశాస్త్రుల్లుగారితో.

భైరవశాస్త్రుల్లుగారు అప్పుడే భోజనముచేసి అంగావస్త్రముతో చేతులు తుడుచుకొంటూ వచ్చి అరుగుమీద కూర్చున్నారు. రాత్రి ఎనిమిదిగంటలయింది. ఆసమయానికి ఆచుట్టుపట్ల కాపురమున్న నేనూ యితరగృహస్థులూ భైరవశాస్త్రుల్లుగారి అరుగుమీద చేరి పిచ్చాపాటీచెప్పుకోవడం అలవాటు. భైరవశాస్త్రుల్లుగారికి కథలంటే మహాసరదా. ఏప్రశ్న అడిగినా ఆప్రశ్నకు సమాధానంగా ఒకకథ చెప్పుతూఉంటారు.

"త్యాగం అంటేనా?" అని శాస్త్రుల్లుగారు ఒకమారు త్రేన్చి, కడుపు సవరించుకొని, అంగావస్త్రం నడుంచుట్టూ తిప్పి మోకాళ్లకింద కట్టి పర్యంకబంధం వేసుకొని "త్యాగం అంటేనా?" అన్నారు.

"చిత్తం. త్యాగం అంటే తమ రేమిసెలవిస్తారో వినాలని వున్నది శాస్త్రుల్లుగారూ!" అన్నాను.

"భగవద్గీతలలో త్యాగం అన్నప్పుడు సర్వకర్మఫలత్యాగమే త్యాగముగా ఎన్నుకోవలసిఉంటుందని చెప్పబడ్డది. అట్టిత్యాగమున్నూ సత్త్వ రజ స్తమోగుణాల ననుసరించి ముత్త్రివిధముగా ఉంటుంది అని చెప్పబడ్డది. కాని దరిమిలాను త్యాగార్థము అనేకవిధాలగా మారింది. త్యాగానికి ప్రసిద్ధార్థము ఈవి. ఋషితో సమానమైన కాళిదాసుగారుకూడా "త్యాగాయ సంభృతార్థానాం" అన్నారు. అతడికి యెంతమాత్రమూ త్యాగంలేదన్నా, త్యాగబుద్ధి లేదన్నా లోకములో, ఈవిలేనివాడు అనేఅర్థమునే చేసుకొంటారు.

ఇది ఇలా ఉండగా ఈకాలములో ఆత్మత్యాగమనేమాట తరుచుగా వాడుతున్నారు. దీని కర్థము దేహత్యాగమనే; అనగా ఉదాత్తమైన కార్యాన్ను ద్దేశించి తనప్రాణములను విడిచిపెట్టడమే. ఆత్మత్యాగ మనే మాటలో ఆత్మకు దేహమనే అర్థం చెప్పాలి. ఎందువల్లనంటే ఆత్మ అనేదానికి త్యాగమంటూ ఉండదుకదా. ఆత్మ త్యజించేదీ కాదు త్యజించబడేదీకాదు" అని శాస్త్రుల్లుగారు పొడుంకాయకోసం యిటూ అటూ వెతుక్కోవడం మొదలుపెట్టారు. కథ చెప్పడానికి బదులు వ్యాఖ్యార్థంచేస్తున్నారు, అడ్డుప్రశ్న వేస్తేనేగాని ఈధోరణి తగ్గదని అన్నానుగదా—"శాస్త్రుల్లుగారూ! ప్రాచీనకాలంలోనైతేనేమి, ఈకాలంలోనైతేనేమి ఉత్కృష్టమైన త్యాగంచేసినవాళ్లు చాలా మంది ఉన్నారు గదండీ?"

శాస్త్రుల్లుగారు పొడుంపట్టు పట్టుకొని, "తొందరపడకు, విశ్వం, తొందరపడకూ; వస్తున్నాగా — అయితే ఈ త్యాగమున్నూ అనేకవిధాలగా ఉంటుంది. మనవిశ్వం చెప్పినట్లు గొప్పగొప్పత్యాగాలు చేసినవాళ్లు పూర్వమందూ ఇప్పుడూకూడా ఉన్నారు. అజమహారాజు, రఘుమహారాజు, శ్రీరామచంద్రులవారూ, శ్రీకృష్ణచంద్రులవారూ—"

"అయితే శాస్త్రుల్లుగారూ — వీరు వీరు చేసినటువంటి త్యాగాలు—"

"తొందరపడకయ్యా. విశ్వం — చెప్పవచ్చిన మాట ఏమిటంటే — మహాపురుషులైతేనేమి, స్త్రీలైతేనేమి, పూర్వకాలమందైతేనేమి, యీకాలమందైతేనేమి చేసినత్యాగాలు అనేకవిధములుగా ఉండుకుంటున్నవి. శ్రీకృష్ణచంద్రులవారిని సత్యభామాఅమ్మవారు నారదులవారికి దానముచెయ్యడమనేది బహు ఉత్కృష్టమైన త్యాగమనిపించుకుంటుంది. మరిన్ని మరణించిన భర్తలతోపాటు సహగమనము చెయ్యడము అనే దేహత్యాగము ఏదైతేగలదో అదిన్ని ధర్మప్రేమ పరమావధిగాగలది అయినప్పటికిన్ని అమ్మవారి త్యాగముతో సరితూగదు.

ఇది యిలా ఉండగా — శైవసంప్రదాయదీక్షితులైన భల్లాణమహారాజులుంగారు జంగమరూపమున అతిథిగా వచ్చిన శ్రీమహేశ్వరులవారి భోగార్థమై నిజధర్మపత్నిని త్యాగముచెయ్యడమనేది శైవులలో భక్తిపారమును తెలియజేస్తుంది."

"అయితే శాస్త్రుల్లుగారూ! ఇట్టిత్యాగము శైవులలోనేగాకుండా మనలోకూడా ఉన్నట్లు భారతము చెప్పుచున్నదిగదండీ—"

"అతిథి నిను గోరెనేనియు మతి గింకిరిపడక యోలమాసగొనక నీ వతనికి సపర్యసలుపుము" అన్నాడుగదా."

"అవును, ఆమాట నిజమే, అతిథి అభ్యాగతులు విష్ణువుతో సమానులని ప్రమాణ వాక్యము లున్నవికాబట్టిన్ని, మన దేహప్రాణమానములు భగవంతునివేకాబట్టిన్ని యిట్టిత్యాగమున్నూ భల్లాణచక్రవర్తి త్యాగమువంటిదే అవుతుంది.

మరిన్ని దేశక్షేమముకోసము యోధులున్నూ, దేవతాప్రీతికోసం ప్రాకృతభక్తులున్నూ ఎట్టిత్యాగమైనా చేస్తారు.

అన్నికాలాలలోను ఎక్కువగా చేయబడే త్యాగం స్త్రీప్రేమకోసంఅని మీకు తెలిసే ఉంటుంది.

అన్నిత్యాగాలకంటె అత్యుత్తమమైన త్యాగం ఏమిటంటే — ముక్తికోసం సర్వసంగపరిత్యాగం చేసే సన్న్యాసిది. ఏలనంటే—"

"దీని కేదైన కథ ఉన్నదా శాస్త్రుల్లుగారూ?" అన్నాను, ఉండబట్టలేక.

కథమాటకు వస్తే—కథా ఉన్నది!—దీనికి కాదు గాని—అయితే వినండి చెబతాను.

౨

సుమారు యిప్పటికి రెండువందల ఏళ్ల క్రితం సంగతి.

ఆ కాలంలో రాఘవరాజుగత్తర అని ప్రజలు భయంతో చెప్పుకుంటూ ఉండేవారు. మొన్న మొన్నటిదాకా పిఠాపురంలో ముసలివాళ్లుకూడా ఒకమారు ఈ రాఘవరాజును తలుచుకొని భీతావహులవుతూ

వుండేవారు. రాఘవరాజు అనేధైర్యశాలి ఏకులంవాడో తెలయదు. ఏఊరివాడో తెలియదు, కాని తనవంటి ధైర్యసాహసాలు కలిగినటువంటివాన్నీ, తనవలె బలాఢ్యులైనటువంటివాన్నీ జట్టీలను యాభైమందిని పోగుజేసికొని అదునుచూచి గ్రామాలమీద పడి దోచుకొంటూ వుండేవాడు. ఆకాలపు రాజులకు అట్టి దోపిళ్లు తెలియనే తెలిసేవికావు. ఒకవేళ తెలిసినా వాళ్లు ఏమీ చేయలేకపోయేవారు. ఏలనంటారా —— దొరతనము వారి సిబ్బంది ఒకతట్టునుంచి వస్తే రాఘవరాజు మరొక యింకోతట్టుకు పారిపోయేది.

నానాటి కీరాఘవరాజుతొందర ఎక్కువైపోతోంది. ఏవిధంగానైనా యితగాడిని రాజసైన్యముచేత పట్టిద్దామన్నా అతగాడి నివాసము కొండలలో.

కొండలలో ఒకకోట కట్టుకొని ఆకోటలో తానూ తనసహచరులూమాత్రము ఉంటూండేవారు. వారికి కుటుంబా లున్నవో లేవో, ఒకవేళ ఉంటే అవి ఎక్కడ ఉంచబడ్డవో ఎవరికీ తెలియదు.

ఈరాఘవరాజుతొందర తట్టుకోవడం చుట్టుపట్టులనున్నగ్రామాలకు చాలాకష్టమౌతూ ఉన్నది. ఉన్నధనమూ, బట్టలూ, జవాహారీ భోషాణాలలో దాచుకొన్నా లాభం లేకుండాఉంటున్నది. పెరళ్లల్లో పాతినా లాభములేకుండాఉంటున్నది. కోటలవంటి యిళ్లల్లో కాపురముండే మోతుబర్లచేతి కిచ్చి దాచిపెట్టమన్నా లాభములేకుండా ఉంటున్నది.

ధనము పోతేపాయె. అతగాడు పెట్టేబాధలు సహించడం బహుకష్టంగా ఉండడంవల్ల గ్రామస్థులకు ఏమిచేయడానికీ తోచలేదు. తాము పన్నులు చెల్లిస్తున్నప్పటికిన్నీ, తా మెన్నిమారులో మొరపెట్టుకొన్నప్పటికిన్నీ తమ ఏలిక ఏమీ చెయ్యలేకుండా ఉన్నాడు. అతగాడిని అని లాభం లేదు కదా! ఇక చేయవలసిం దేమిటి?

ఆయాగ్రామాలలో ఉండే పెద్దలందరూ సమావేశమయ్యారు. కర్తవ్య మాలోచించారు. తమ యేలికకు పన్ను లిచ్చేబదులు ఈ రాఘవరాజుకే ఏటేటా పన్నులు చెల్లిస్తూ ఆయన్నే తమయేలికగా ఏర్పాటు చేసుకొంటే తమకు ఇంత ధన నష్టమున్నూ ఉండదు. బాధలున్నూ ఉండవు. క్లేశమున్నూ ఉండదు.

అయితే అందుకు రాఘవరాజు సమ్మతిస్తాడా? దేశాలు దోచుకొనే దొంగ అనిపించుకోవడంకన్న గ్రామాలనుండి పన్నులు వసూలుచేసుకొంటూ, అందుకు ప్రతిఫలంగా గ్రామస్థులను రక్షించుకొంటూ, రాజచిహ్నములు ధరించి ఏలిక అని అనిపించుకోవడముకు అతడు సమ్మతించడా?

ఈయేర్పాటులో మరిన్ని మరివక చిక్కు ఉన్నది. అదేమిటంటే తమ్ము యింతకర కున్నూ పాలిస్తూన్న ఏలిక, తమకు పన్నులు చెల్లించడం లేదనే కారణంవల్ల ఈ గ్రామాలమీదకి దండెత్తివచ్చి ధ్వంసము చేస్తే అప్పుడు చెయ్యవలసిన దేమిటి? ఈరాఘవరాజు గత్తరకన్న ఆయేలిక దండయాత్ర బహుక్రూరముగా ఉండవచ్చు. చెప్పరాని బాధలు అప్పుడూ అనుభవించవలసిఉండవచ్చు. ధనప్రాణమానముల కప్పుడునూ అపాయము కలుగవచ్చు. అయితే దీనికి ఉపాయమేమిటీ?

తమ మేలిక తమ్ము శిక్షించవలె ననే క్రోధముతో ఒకవేళ దండెత్తివస్తే తమ గ్రామాలను కాపాడే బాధ్యత రాఘవరాజే వహించవలసిఉంటుందనిన్నీ, అట్టిబాధ్యత వహించేపక్షమందే అతగాడికి తాము పన్నులు చెల్లించవలసి ఉంటుందనిన్నీ వారు నిర్ణయం చేసుకొన్నారు.

అందుకొరకై రాఘవరాజుతో రాయబారాలు నడపడమునకై గ్రామస్థులలో కొందరు పెద్దలు ఏర్పాటైనారు. ఈ రాయబారము బహుప్రమాదకరమైన కార్యము. ఏమంటారా? తా నెంతసాహసవంతుడైనా, ఎన్ని ఊళ్లు తాను నిరాఘాటంగా దోచుకొంటూ ఉన్నా, తన కెంతబలగం ఉన్నా రాఘవరాజు నిరంతరమూ భయముతోనే మెలగుతూఉండేవాడు. ఏమూలనుంచి ఏసైన్యము వచ్చిపడుతుందో, తనపై కసితీర్చుకోవడానికి గ్రామస్థులు ఎట్టికుట్రలు పన్నుతున్నారో, ఏచెట్టువెనక ఏశత్రు వున్నాడో ఎక్కడ గోయ్యో, ఎక్కడ నుయ్యో — అని అతగాడిభయం.

ఈ రాయబారకార్యాన్ని ఆతడు కుట్రగా భావించి రాయబారులనందరినీ అతడు చంపివెయ్యవచ్చు. లేదా వారి నాకొండలలో బంధించవచ్చు. వారిని చిత్రవధ చేయవచ్చు. ఏమిచేసినా చేయదగ్గవాడేగదా!

ఇట్టిసందర్భంలో రాయబారం నడపదలచుకొన్న గ్రామపెద్దలు ప్రాణాలకు తెగించియే ఈ కార్యానికి పూనుకొన్నారని వేరే చెప్పనవసరంలేదుగదా!

ఆటవికులవల్లనూ, చారులవల్లనూ గ్రామస్థులు రాఘవరాజుకోట, కొండలలో ఎక్కడ వుండేదీ తెలుసుకొన్నారు రాయబారులు భత్యాలు మూటకట్టుకొని ప్రయాణం సాగించారు. గుట్టలు దాటారు, సెలయేళ్లు దాటారు. కొండలు దాటారు. ఎక్కడా మనిషిఅలికిడి లేదు. జంతువులూ లేవు పక్షులుమాత్రం అక్కడక్కడ దృగ్గోచర మయ్యేవి.

నిర్ధారణగా రాఘవరాజుకోట యిక్కడ వున్నదని తమకు చెప్పేవా రెవరూ లేరు. స్వతంత్రముగా తెలుసుకొనే ప్రయత్నములు విఫలమౌతూన్నవి. ఆనాటిసాయంకాలం ఒక కొండప్రక్కనే విశ్రమించవలెననుకొన్నారు. అక్కడ నీరు ఉన్నది. విశ్రమించడానికి ఎత్తైన బండ లున్నవి. మృగభయము ఉంటుందనే అనుమానం తోస్తే నెగళ్లు వెలిగించుకోవా లనుకొన్నారు. ఈవిధంగా ఆలోచించుకొంటూ మూటలు దింపుకొంటూ ఉంటే — పదిమందిసాహసులు ఎక్కడినుంచో వచ్చి వాళ్లని బాధించారు. వాళ్లు మొలల్లో కటారులు దోపుకొన్నారు. చేతుల్లో కత్తు లున్నవి. గిరజాలజుట్లు. చల్లాడాలు తొడుక్కొన్నారు. వాళ్లు మాట్లాడలేదు. రాయబారులచేతులు వెనకకు విరిచికట్టివేశారు. కళ్లు కనిపించకుండా గట్టిగా గుడ్డలతో బిగించారు. వాళ్ల మూటలు వాళ్ల భుజాలకు మళ్లీ కట్టివేసి వాళ్లను నడిపించుకుపోయారు.

రాయబారులకు సగము ప్రాణాలు పోయినవి. కాళ్లతో తడుముకొంటూ, రాళ్లూ, పేళ్లూ పాదములకు తగిలినప్పుడు తూలుతూ పడుతూ, కొమ్మలు మొహాలకు తగిలినప్పుడు బుర్ర వంచుతూ నెమ్మదిగా నడుస్తూ పోయారు. ఎప్పటికి ఈ బాధ అంతమౌతుందో

తెలియలేదు. తాళ్లుపట్టుకు వాళ్లు నడిపించుకు పోతూనే ఉన్నారు. వీళ్లు వాళ్ల ననుసరించి పోతూనేఉన్నారు.

"ఎవరు నాయనా, మీరు? నిరపరాధులను మమ్ము యీవిధముగా యేల బంధిస్తిరి? మావల్ల వచ్చిన అపరాధమేమిటి?" మమ్మల్ని యిట్లా చేయడంవల్ల మీకు వచ్చే లాభం ఏమిటి? అని అన్నాడు రాయబారులలో ఒక్కడు.

సమాధానం లేదు.

సూర్యు డస్తమించాడో లేదో తెలియదు. ఎండుటాకుల చప్పుడుతప్ప మరేశబ్దమూ వినబడ్డం లేదు.

నెమ్మదిగా నడిచి వెళ్లుతూ ఉండగా ముందు నడిచేవాళ్లు ఆగినట్లు రాయబారులకు తోచింది. వాళ్లూ ఆగారు. వాళ్లను ఎత్తి గాడిదల మీద వేసి కట్టిపెట్టినట్లు వాళ్లు గుర్తించారు. గాడిదలు ఎంతసేపో నడచినవి. ఏదిక్కుగా నడచినవో ఎంతదూరము నడచినవో వాళ్లకు ఆనుపానులు చిక్కలేదు. ఎప్పటికి యీ యాత్ర అంతమునకు వస్తుందో వాళ్లకు గోచరించలేదు.

* * *

చేతులకట్లు విప్పారు. కళ్లకట్లు విప్పారు. చేతులు స్వాధీనమునకు రాలేదు. మొద్దుబారినవి. అంతా చీకటిమయం. నిలబడ్డచోటనే నిలబడిపోయారు.

కొంతసేపైనతర్వాత వాళ్లకు ఒక కొండవంటి పదార్థం కనిపించింది. నిదానంగా చూడగా అది కొండలమధ్య కట్టిన యిల్లని వాళ్లు గుర్తించారు. ఆయింట్లోకి రాయబారులను వాళ్లు తీసుకుపోయారు. అక్కడ వాళ్లను వదలి వెళ్లిపోయారు. విస్మయము, భయము, ఆశ, నిరాశలమధ్య ఊగులాడుతూ వాళ్లు ఆరాత్రి ఆకొండ యింట్లో కలతనిద్రపోయారు.

తెల్లవారింది, అడవిపక్షులు కిలకిలలాడుచున్నవి. వాళ్లు కళ్లునులుముకు లేచారు. కాల్యకృత్యాలు తీర్చుకొన్నారు. కర్తవ్యం ఆలోచిస్తూఉండగా ఇద్దరు ఆజానుబాహులు వచ్చి వాళ్లను రమ్మని సైగచేశారు. రాఘవరాజుసమక్షానికి తీసుకుపోయారు. అది కొండగుహ అయినప్పటికీ చాలా విశాలంగా ఉన్నది. మంచములు, పరుపులు, దిండ్లు, పీకిదోనెలు వగైరాసామానులు గుహనిండా ఉన్నవి. రాఘవరాజు ఒకపరుపుమీద దిండు నానుకు కూర్చున్నాడు. ఆజానుబాహువు. వర్చస్వి.

రాయబారులు చేతులు జోడించి ఎదుట నిలువబడ్డారు. వారిలో నాయకుడు ముందుకువచ్చి యీరీతిగా విన్నవించుకొన్నాడు. "మహాప్రభూ! తమకీర్తి దిగంతవిశ్రాంతము; తమసాహసపరాక్రమములు అర్జునుణ్ణి మరపునకు తెస్తవి. తమహృదయము దయార్ద్రము. మహాప్రభూ! మేము తమదర్శనం చేసుకొని తమతో ఒక్కమాట మనవిచేసుకోవలెనని వస్తూఉండగా ఈపుణ్యాత్ములెవరో తమసమక్షానికే మమ్మల్ని తీసుకువచ్చారు. వెదుకబోయినతీగ కాళ్లకే తగిలింది. ఆడబోయినతీర్థ మెదురైనది. శకునములు మంచివైనవి. తాము ఉదారులు. మా కార్యము తమవల్ల కాకపోదు మహారాజా!"

"ఎవరు మీరు? ఏమిటి మీ కార్యం?"

"తాము పాలించే గ్రామాలలో నివసించే బీదగ్రామస్థులము మేము, మహారాజా!"

"మేము ఎట్టి గ్రామములూ పాలించడం లేదే?"

"తమరు పాలించడానికి సమర్థులై ఉండిన్నీ, సాహసవిక్రమాఢ్యులై ఉండిన్నీ, రాజనీతిపారంగతులై ఉండిన్నీ ఎందువల్లనో యథాక్రమంగా గ్రామాలను పాలించక పోవడం యదార్థమే కావచ్చు, మహారాజా! కాని మేము మాత్రము—యీ ఆరు గ్రామముల కాపురస్థులము, మీకు సమీపమందుండే గ్రామాలలో నివాసం చేస్తూన్న వాళ్లము, తమరినే ధర్మప్రభువులనుగా ఎంచుకొంటూ తమరే మా యేలికగా భావించుకొంటూ ఉన్నాము, మహారాజా! కాబట్టి తమరు మాకు ఏలికగా ఉండి, మావల్ల తాము పన్నులుగ్రహిస్తూ, మమ్మల్ని రక్షించేభారం వహించరా మహాప్రభూ?"

"అందుకా మీరు వస్తే?"

"చిత్తము, మహాప్రభూ!"

"మీ యేలికకు పన్నులు చెల్లించకుంటే అతనివల్ల మీకు ఉపద్రవము సంభవించదా?"

"తమరి అండ జేరిన మాకు ఎట్టిఉపద్రవాలూ సంభవించవని మా ధైర్యం. తమరు నిజముగా విజృంభిస్తే తమపరాక్రమును ఎవ్వరు తట్టుకోగలుగుతారు, ధర్మప్రభూ!"

రాఘవరాజు వారు చెప్పినమాట లన్నీ విన్నాడు. తన సహచరులతో ప్రసంగించాడు. ఇటువంటి తరుణం పోగొట్టుకోవడం మంచిది కా దనుకొన్నాడు. ఈ రాయబారములో మోసము లేదని తేల్చుకోవడమునకున్నూ, గ్రామస్థుల సద్భావమును పరీక్షించడమునకున్నూ, తాను ఏలిక అయ్యే పక్షమందు తన పదవిని దృఢపరుచుకోవడమునకున్నూ కొన్ని షరతులు ఏర్పాటు చేశాడు. ఆ షరతులప్రకారం వారు నడచే పక్షమందు తాను వారి ఏలికగా ఉండి ఎట్టి ప్రమాదములూ గ్రామములకు రాకుండా కాపాడతానని చెప్పాడు. తక్షణం యీ ఆరు గ్రామాలవారూ తనకు ఆయేటిపన్నులు చెల్లించడం మొదటి షరతు. గ్రామములలో ఉండే పురుషులలో యుక్తవయస్సు వచ్చినవా ళ్లందరూ తనవద్ద తరిభీతుపొంది అవసరమైనప్పుడు తనకు యుద్ధకార్యములలో సహాయము చెయ్యాలి.

ప్రాకారము, బురుజులు, కందకము మొదలైనవాటితో అతనికి ఒకకోట అనువైన తావున గ్రామస్థులే కట్టించవలెను.

ప్రతీగ్రామమునకున్నూ ప్రాకారములు, బురుజులు, కందకములు ఆగ్రామస్థులే కట్టుకోవలెను.

ఈషరతులు రాయబారులు వప్పుకొన్నారు. రాయబారులను గౌరవించి, బహూకరించి, కొంతవరకూ తనమనుష్యులను తోడుయిచ్చి వారిని సాగనంపించాడు రాఘవరాజు.

౪

రాఘవరాజుకు మొదటిదఫా పన్నులు చెల్లినవి. గ్రామస్థులు సద్భావముతో ప్రవర్తిస్తున్నారని అతడు గ్రహించాడు. తాను తనఅనుచరులతో తనస్వాధీనమం దుండే గ్రామాల నన్నింటినీ చూచినాడు. గ్రామ

స్థులను పుంగొల్పి ప్రతిగ్రామమునూ ఒక చిన్నకోటగా మార్చివేసినాడు. అన్నిగ్రామములలోను గరిడీ లేర్పాటుచేసినాడు. యుద్ధపరికరాలు చేయించినాడు. యుక్తవయస్సు గల పురుషు లందరినీ కూర్చి సైన్యము తయారుచేశాడు.

అన్ని గ్రామాదులకూ అందుబాటుగా ఉండగలందులకున్నూ, రక్షగా ఉండగలందులకున్నూ, తాను తనప్రజలు కొందరితో నివసించగలందులకున్నూ ఒకకోట కట్టడానికి అనువైన స్థలము నిర్ణయము చేశాడు.

కంటకబాధ తీరినందుకు ప్రజలు సంతోషించారు కాని తమ మొదటి యేలికనుండి ఎట్టి చిక్కులు వస్తవో అని భయపడుతున్నారు. ఆభయమున్నూ రాఘవరాజు తీర్చినాడు. ఆఏలికతో తాను రాయబారాలు నడిపాడు. కప్పము కొంత తాను క్రమముగా చెల్లించడానికి వప్పుకొన్నాడు. తాను సామంతరాజుగా ఉండుటకు అంగీకరించమని కోరాడు. యాభైగ్రామములవారూ తన చెప్పుచేతులలో ఉండుటకు అంగీకరించారనిన్నీ, తనద్వారా వారిసేవ ఏలిక పొందవచ్చుననిన్నీ నచ్చచెప్పాడు. ఇట్టితరుణము పోగొట్టుకొంటే ధన, ప్రాణముల కపార నష్టము సంభవించగలదనికూడా సూచించాడు. ఎన్నడూ సక్రమముగా పన్నులు వసూలుకాని కారణముచేత ఆయేలిక యీయేర్పాటులకు వప్పుకొన్నాడు. గ్రామస్థులు సంతోషించారు.

* * *

"అయితే భైరవశాస్త్రుల్లుగారూ—ఈకథలో త్యాగమనేది ఆరాయబారులు చేసినట్లా యీ రాఘవరాజు చేసినట్లా మీ అభిప్రాయ మేమిటి?" అన్నాను. వేళ అతిక్రమిస్తోంది. కళ్లు బరువెక్కుతున్నాయి. ఎంతకీ కథ ముగియడంలేదు.

"మళ్లీ తొందరపడుతున్నావూ, విశ్వం? జరిగినకథలో లేదు త్యాగం. ముందు వస్తోంది—కథ కావచ్చిందిలే—"అన్నారు భైరవశాస్త్రుల్లుగారు.

"చిత్తం — కానీయండి."

* * *

౫

పూర్వకాలాల్లో రాజులకు కోట కట్టవలసివస్తే అది నరబలిలేకుండా జరిగేదికాదు. కోటకు సౌభాగ్యము, దేశమునకు కల్యాణము యీ నరబలివల్లనే చేకూరగలవని ఆనాటినమ్మకం. రాఘవరాజుకోట చురుకుగా తయారవుతోంది. ప్రాకారాలు లేచినవి. కొంతవరకు కందకములు తవ్వడమైనది. కందకములకు నీరు కొండసెలలనుంచి తీసికొని వచ్చుటకు కాలవలు తవ్వుతున్నారు. మూడు దిక్కులా మూడుబురుజులు తయారైనవి. నాల్గవదిక్కున బురుజు కట్టవలసి ఉన్నది. అక్కడే, అది కట్టుటకు ముందుగానే నరబలికూడా జరగవలసిఉన్నది. నరబలికోసమని బలవంతాన మనుష్యులను తీసుకురావడం ఆనాటి ఆచారము కాదు. ఐచ్ఛికముగా ధైర్యోత్సాహములతో ఎవ్వరైనా అట్టి బలికి సంసిద్ధులు కావచ్చు. అట్టి బలిలో ఆధైర్యవంతులు దేశసేవ చూడవచ్చు. అట్టి బలిలో వారు మోక్షము చూడవచ్చు. దేహమును బలియిచ్చినంతనే, దేశకల్యాణము, ధర్మస్థాపన, మోక్షము కలుగునని నమ్మకమున్నప్పుడు దేహాభిమానులు

కానివారు యిట్టి నరబలి కియ్యకొందురంటే ఆశ్చర్య మేమిటి? ఇట్టి ఆశయములకే ఎందరీ కాలములో దేహత్యాగం చెయ్యడంలేదు? నాల్గవబురుజు కట్టి ప్రాకారము పూర్తిచేయవలసియున్నది. బురుజుకు పునాదులు నరదేహముమీదనే పడవలెను.

నరబలికి ముహూర్త మేర్పాటైనది. బురుజుకు పునాదులకొరకై పెద్దగొయ్యి తవ్వినారు. ఆగోతిలో ముత్తైదువులు పసుపూకుంఖం చల్లినారు. పెద్దలూ పిన్నలూ స్త్రీలూ పురుషులూ ఆబాలగోపాలమూ ఆగోతిలో — పళ్లో, బట్టలో, నాణెములో, పసుపో కుంఖమో, పువ్వులో ఏదోవకటి వేస్తూవచ్చారు. ముత్తైదువులు మంగళహారతి పళ్లెములు పట్టుకొని గోతికి కొంతదూరముగా నిలబడ్డారు. మేళతాళాలవాళ్లు వారికి ముందుగా నిలబడ్డారు. గోతిచుట్టూ వీరపురుషులు పునాదిరాళ్లదగ్గిర నిలబడ్డారు.

ముహూర్తం సమీపిస్తోంది. ఎవరు నరబలికి ఆముహూర్తకాలానికి సరిగా వచ్చి ఆగోతిలో దూకుతారో తెలియడంలేదు. వ్యగ్రోత్సాహులై అశేషజనమూ కనిపెట్టి చూస్తూ ఉన్నారు. వారిఉత్సాహములో భయమూ, జాలీ, ధర్మబుద్ధీ తాండవమాడుచున్నవి.

ముహూర్తం సమీపిస్తూన్నది.

దూరమున ఒక చక్కని స్త్రీ కన్నులనుండి బాష్పములు జారుచున్నవి. పసుపు రాసుకొన్న మొహమైనప్పటికి వెల్లదనము కనిపిస్తోంది. ఆవిడ కెదురుగా నిలబడ్డా డొకపురుషుడు. కండలు తిరిగిన శరీరం. ఆమె ఆ శరీరానికి పసుపు కలిపిన మంచిగంధం పూసింది. ఆపురుషుని మెడలో మందారపుష్పమాల వేసింది. అత డామె చేతులు పట్టుకున్నాడు. దిగులు పడవద్దని అతని కళ్లు ఆమెతో చెప్పినవి.

ఆమె ఆతనిభార్య! అతడు బలియగుటకు — దేశక్షేమమునకై, ధర్మమునకై బలి అగుటకు ఆమె సమ్మతించింది. కడసారిమాటు ఆమె నతడు చూచాడు. తల తిప్పుకొన్నాడు. ఆమె చేతులు వదలినాడు. ఫీట్కారము చేస్తూ గోతివైపు అతడు దుమికినాడు.

ఆమె అక్కడనే నిలిచియున్నది. ఆమెదృష్టి అతనిమీదనే నిలిచియున్నది. ఆమెకు రెప్పపాటు పడలేదు. దేహము కదలలేదు. ఫీట్కారశబ్దము ప్రజలు విన్నారు. ఒక్కమారు అతనికేసి చూచారు — "హరహర శంభో" — ఒక్కమారు కోటిగొంతుకలలోనుంచి బయలువెడలింది. తూర్యనాదాలు చెలరేగినవి. స్త్రీలూ పురుషులూ అతని మెళ్లో పుష్పమాలలు వేస్తున్నారు. అతనికి కొత్తబట్టలు కప్పుతున్నారు. ముత్తైదువులు కర్పూరాలు వెలిగించి మంగళహారతులు పాడ మొదలుపెట్టారు.

ఆమె అక్కడనే నిలిచియున్నది. ఆమెదృష్టి అతనిమీదనే నిలిచియున్నది. ఆమెకు రెప్పపాటు పడలేదు. దేహము కదలలేదు.

వీరహుంకారాలు, తూర్యనాదాలు, హరస్మరణలు, మంగళహారతులు — ఈఘోషలో ఆవీరపురుషుడు "శంభో" అని ఉచ్చైస్వరముతో ఆర్చి ఒక్కగంతు వేసి గోతిలోకి దుమికాడు సరిగా ముహూర్తకాలముకు. చుట్టూ నిలిచిన పురుషులు పునాదిరాళ్లు గోతిలోకి తోశారు. వాద్యఘోష మిన్ను ముట్టుతున్నది. రాళ్ళతో గోయి

నిండింది. "హర, హర, శంభో" దిక్కులు నిండింది.

ప్రజ లింటిముఖము పట్టారు. బురుజు కట్టుటకు పనివాళ్లు అప్పుడే పూనుకొన్నారు. క్రమ క్రమంగా జనసమ్మర్దం తగ్గింది. కాని —

ఆమె అక్కడనే నిలిచియున్నది. ఆమెకు రెప్పపాటు పడలేదు. దేహము కదలలేదు.

రాఘవరాజు నరబలిచూచాడు. ప్రజల ఉత్సాహము చూచాడు. ఆవీరుని ధైర్యసాహసాలు మెచ్చుకొన్నాడు. ప్రజలు యిండ్లకు వెళ్లడం చూచాడు. అందరూ యింటికిపోయినా ఒకస్త్రీ మాత్రం కదలక మెదలక ఒక్కచోట నిలబడిఉండడం ఆతడు గ్రహించాడు. కారణము తెలుసుకొందామని ఆస్త్రీని సమీపించాడు. అత డామెను చూచాడు. ఆమె అతన్ని చూడలేదు. పలకరించాడు. మాటాడలేదు. భయపడి తిరిగి వెళ్లిపోయాడు. ఆరాత్రి అక్కడ కాపలాఉంచాడు. మర్నాడు మళ్లీ వచ్చి చూచాడు. అక్కడ స్త్రీవిగ్రహం లేదు. స్త్రీప్రతిమ ఉన్నది. అక్కడ ఆమె నిలిచియున్న తావుననే; ఆమెకళ్లే; ఆమెదేహమే; ఆమెముఖమే; ఆమెయే.

ఆమె అక్కడనే నిలిచియున్న ట్లున్నది. ఆమె దృష్టి అతనిమీదనే నిలిచియున్నట్లున్నది. ఆమెకు రెప్పపాటు లేదు.

ఒక్క కలికాలఖండములో, ఒక్క సతి, ఒక్కనాటిలో, శిలాప్రతిమగా మారి తన సతీత్వమును ఘనీభవింపజేసింది.

ఆనాటినుండీ ఆశిలాప్రతిమను ప్రజలు పూజిస్తూ ఉండేవారు.

రాఘవపాలెం జమీందారుగారి కోటదగ్గిర యీ శిలాప్రతిమ నేడుకూడా మనము చూడవచ్చు. కాని మన మది శిల్పి మలిచిన విగ్రహ మనుకుంటాము.

రాఘవపాలెంజమీందారుగారు రాఘవరాజుగారి సంతతివారేఅని చెప్పుకుంటారు. ఈ మధ్య వారికి "రాజా" అనేబిరుదు దొరతనమువా రిచ్చేరని వదంతి.

* * *

"అయితే భైరవశాస్త్రులుగారూ — అతగాడు చేసినత్యాగం సాత్విక రాజస తామసాల్లో ఏదిగా ఎన్నుకోవలసిఉంటుందండీ" అన్నాను లేచి.

"అబ్బాయీ, విశ్వం, అతగాడు చేసిన త్యాగం గొప్పదైనా అంతకన్నా గొప్ప త్యాగం చేసిన అతనిభార్యసంగతి ఎత్తుకోవేమి ?"

"చిత్తం. ఆమాట నిజమే. — ఇక సెలవిప్పిస్తారా?"

"మంచిది. త్యాగ మన్నప్పుడు అంతకు మించినత్యాగ మెక్కడా నాకు కనిపించ లేదుసుమా!"

"చిత్తం సెలవు."